

మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



కాన్హా కాన్హా

ఆన్ పడీ మై తేరే ద్వార్

మోహె చాకర్ సమఝ్ నిహార్

'షాగిర్ద్' సినిమా అల్లరి చిల్లరి తేలికైన హాస్య సినిమా 1960 దశాబ్దంలో వచ్చిన అనేక హిందీ సినిమాల్లాగే మామూలు ప్రేమ కథ ఇది. పాటల ఆధారంగా ప్రేక్షకులు మనస్సులను గెలిచితే 'హిట్ ' సినిమాగా నిలచింది. అప్పటి ట్రెండ్‌ను అనుసరించి సినిమాలో పాటలు కూడా వేగంగా, మధురంగా ఉంటాయి. పాశ్చాత్య 'రాక్ ఎండ్ రోల్' లాంటి పాటల నడుమ ఒక భజన పాట ఉంటుంది. అదే ఈ అత్యద్భుతమూ, అతి మధురమూ, అర్ధవంతమూ అయిన భక్తిగీతం.

సినిమాలో హీరో చదువు సంధ్య లేని అమాయకపు అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆమెను తన ఇంటికి తీసుకువస్తాడు. అది అతడి తల్లిదండ్రులకు నచ్చదు. ఆ కాలంలో నాయికలు హీరోల మనస్సులు దోస్తే సరిపోదు హీరో తల్లిదండ్రులను కూడా మెప్పించాలి. ఆ కాలంలో హీరో తల్లిదండ్రులను మెప్పించాలంటే, అందరికన్నాముందు, ఉదయమే లేచి, దైవ ప్రార్ధనా గీతం ఆలపించాలి. అది ఆమె అత్యుత్తమ సంస్కారానికి నిదర్శనం. అప్పటి ఇళ్లల్లో ఓ పూజగది ప్రత్యేకంగా ఉండేది. కాబట్టి, ఆమె భజన గీతం ఆలపిస్తూంటే, ఒకరొకరుగా ఇంటిల్లపాదీ వచ్చి కూచుంటారు. ముగ్ధులైపోతారు. నాయికను తమలో ఒకరిగా భావిస్తారు. ఇలాంటి సందర్భంలో నాయిక పాడే పాట ఇది.

'కాన్హా' అంటే కృష్ణుడు. 'కన్హయ్య అంటారు వారు. 'కన్నయ్య' అంటాం మనం. ' కన్హయ' నుంచి 'కాన్‌హా వచ్చింది. కృష్ణుడిని ఆమె గొంతెత్తి పిలుస్తోంది. నేను నీ ద్వారం ముందుకు వచ్చాను. నన్ను నీ సేవకురాలిగా భావించి స్వీకరించమని అభ్యర్థిస్తోంది నాయిక.

ఈ భజనను రాసింది గేయ రచయిత 'మజ్రూహ్ సుల్తాన్‌పురి'. అచ్చమైన సినీ గేయ రచయిత మజ్రూహ్. ఇతర గేయ రచయితల గేయ రచనా సంవిధానాన్ని బట్టి రాసిందెవరో ఊహించవచ్చు. కానీ మజ్రూహ్ పాటలను అలా గుర్తించటం కుదరదు. ఎందుకంటే, తన అస్తిత్వాన్ని సినీపాటలో సంవిలీనం చేస్తాడు మజ్రూహ్. పాట రాసేప్పుడు తన స్వీయ వ్యక్తిత్వాన్ని విడిచి తానే పాత్ర అయి, సందర్భాన్ని అనుసరించి పాటను రచిస్తాడు. దాంతో పాటలు హిట్

అవుతాయి. కానీ ఇది 'మజ్రూహ్' రచనా సంవిధానం అని గుర్తుపట్టేందుకు ఎలాంటి ఆధారాలు లభించవు. అందుకే అసలు సిసలైన సినీగేయ రచయిత మజ్రూహ్.

'మజ్రూహ్' ఉర్దూకవి. కానీ ఈ పాటను అనేక భక్తిగీతాలలాగే బ్రిజ్ భాషలో రచించాడు. ఇది కృష్ణ భక్తిగీతం. ఈ భజన గీతాన్ని మజ్రూహ్, ఒక ఘజల్ పంధాలో రచించాడు. మజ్రూహ్ అభ్యుదయ భావాల కవి. కానీ ఈ పాటలో ఆయన భారతీయ భక్తి తత్వాన్ని అర్ధం చేసుకుని, వాగ్గేయకారుడు గీతాన్ని రచించినట్టు రచించాడు. పల్లవిలోనూ ప్రతి చరణంలోనూ ఒకో రకమైన 'భక్తిని' ప్రదర్శించాడు.

పల్లవిలో 'శరణాగతి' భావాన్ని ప్రదర్శించాడు. భక్తుడు భగవంతుడిని శరణు వేడతాడు. 'నేను నీ ద్వారం ముందుకు వచ్చాను. నన్ను నీ ప్రేయసిగా స్వీకరించు' అనటంలోనే శరణు వేడటంతో పాటు దాస్య భక్తి భావన కనిపిస్తుంది. భగవంతుడు యజమాని. తాను సేవకుడు 'మజ్రూహ్' చేసిన చమత్కారం ఏమిటంటే 'సూఫీ'ల ప్రేమ భావనను, భక్తిభావనతో మిళితం చేసి 'కృష్ణభక్తి'ని అత్యద్భుతంగా ప్రదర్శించాడు. సూఫీలు భగవంతుడిపై ప్రేమను తాము ప్రేయసిగా, భగవంతుడుని ప్రియుడిగా భావించి ప్రదర్శిస్తారు. ఇక్కడ మజ్రూహ్ అదే చేసాడు. కృష్ణుడు భగవంతుడు. నాయిక భక్తురాలు. కృష్ణుడు ప్రియుడు. ఆమె ప్రేయసి. కృష్ణుడు యజమాని. ఆమె దాసి. 'మీరా భజనలలో ఆమె తనను కృష్ణుడి దాసిగా చెప్పుకుంది. కృష్ణుడు తన ప్రియుడంది. కృష్ణుడు తన యజమాని అంది. అదే ఇక్కడ వాడాడు మజ్రూహ్.

చాకర్ అన్నది ఫార్సీ పదం. అది హిందీ. ఉర్దూలలోకి ప్రవేశించింది. 'చాకర్' అంటే సేవకుడు. మనం 'నౌకర్లు, చాకర్లు' అంటాం. ఆ 'చాకర్' ఇది. నన్ను సేవకురాలిగా భావించి స్వీకరించమంటోంది నాయిక.

సంగీత దర్శకుడు 'లక్ష్మీకాంత్ ప్యారేలాల్ ఈ పాటను జానపద రాగమయిన 'మాండ్' రాగానికి 'ఖమాజ్' రాగాన్ని కలిపి రూపొందించాడు. దాంతో పాటకు ఓ రకమైన ఆర్తి అబింది. 'కాన్హా' అని పిలవటంలో మాధుర్యం, లోతయిన భావనలతోపాటు కెహర్వా తాళంలో రూపొందించాడు. వేణువు, సితార్, ధోలక్ వంటి సాంప్రదాయక వాయిద్యాలతో పాటు వయొలిన్లు వాడి పాటను ఆకర్షణీయం చేశాడు. ఈ పాటలో మురళి వాయిద్యం మనోహరంగా రాగాలను పలుకుతుంది.

లత పాటను అద్భుతంగా పాడిందనటం అందరికీ తెలిసిన విషయమైనా మరోసారి చెప్పక తప్పదు. ఆరంభంలో ఆలాపన మృదువుగా, శాంతంగా ఉంటుంది. 'కాన్హా' అన్న పిలుపు హృదయ లోలోతుల్లోంచి వచ్చిన పిలుపులా ధ్వనింపచేస్తుంది. శరణాగత ప్రపత్తి ధ్వనిస్తుంది ఆర్తితో 'కాన్హా' అని పిలవటంలో. ఈ పాటలో ఆమె పలు రకాల అలంకారాలను ప్రతిభావంతంగా శ్రోత మనస్సుపై ప్రభావం చూపించే రీతిలో ప్రదర్శించింది. ముఖ్యంగా 'ఆన్ పడీ' అని ప్రతి సారీ ఓ రకంగా అంటుంది. నిజంగా ద్వారం ముందు పడి ఉన్న దీనురాలిలా ధ్వనించి కరుణరసాన్ని కలిగిస్తుంది. 'మోహె చాకర్ సమఝ్ సాహోర్ ' అనటం మంద్రస్థాయిలో మృదువుగా బ్రతిమిలాడుతున్నట్టు పలుకుతుంది. ఒకో

పదానికి లోతైన అర్థాన్ని ఇస్తూ, భావాన్ని పలుకుతూ లత పాడిన విధానం ఆమెను ఎందుకని 'సంగీత సరస్వతి' అంటారో తెలుపుతుంది. ముఖ్యంగా రాగాలు తీయటం, పదాలను పలికి ఆగి, పాటను ఎత్తుకోవటం, ఇదంతా రాగం భావం చెడకుండా, పవిత్ర భావాన్ని పరవళ్లు తొక్కేట్టు పాడటం మామూలు గాయనిలకు సాధ్యం కాదు.

తూ జిసె చాహే ఐసీ నహీ మై
హాన్, తెరి రాధా జైసి నహీ మై
ఫిర్ భీ హూ కహతీ కహతీ నహీమై
కృష్ణా మోహే దేఖ్‌తో లే ఎక్ బార్.

నువ్వు కోరి ఇష్టపడేట్టూ లేను నేను. నీ రాధలా నేను లేను. అయినా నిన్ను ఒకసారి నావైపు చూడమని పదే పదే వేడుకుంటున్నాను. ఇక్కడ చూడడమంటే చూడటం కాదు. తనని స్వీకరించమని అభ్యర్థించటం. ఈ చరణంలో మజ్రూహ్ ఆత్మ నివేదన భక్తి భావాన్ని ప్రదర్శించాడు. కరుణ రసాన్ని కురిపించాడు. శ్రీకృష్ణుడు స్వీకరించేంత అర్హత ఆమెకు లేదు. కానీ ఆశ ఉంది. గడ్డిపువ్వు కూడా భగవంతుడి పాదాలను చేరాలని తపన పడుతుంది. అలాంటి తపన ఈ చరణం ప్రదర్శిస్తుంది. ఒకసారి నన్ను చూడమని, స్వీకరించమని కరుణ రసం ఉట్టి పడేలా బ్రతిమలాడుతోంది. తాను అతడికి సరిపోనని తెలుసు. అయినా ఒకసారి తనవైపు దృష్టి తిప్పమని అభ్యర్థిస్తోంది.

బూంద్ హి బూంద్ మై ప్యార్‌కి చున్‌కర్
ప్యాసి రహీ పర్ లాయీ హూ గిరిధర్
టూట్ హి జాయే ఆస్ కి గాగర్
మోహనా ఐసి కంకరియా నా మార్

ప్రేమ బిందువులు ఒక్కొక్కటి ఎంచుకుని, ఆమె దాహార్తితో ఉండి కూడా అర్పించటానికి తీసుకువచ్చింది. రాళ్లు విసిరి ఆశా భాండాన్ని పగలగొట్ట వద్దంటున్నది. అద్భుతమైన మాధుర్య భక్తి భావనను విరహ భావనతో కలిపి ప్రదర్శించాడు ఈ చరణంలో. పల్లవిలో దాస్య భావన, చరణంలో ఆత్మ నివేదన తనని తాను అర్పించుకోవటంగా మారింది. రెండవ చరణంలో మాధుర్య భక్తి భావన కనిపిస్తుంది.

తాను దాహంతో ఉండి కూడా తన ప్రేమను భగవంతుడికి అర్పిస్తున్నది. తన ఆశను భగ్నం చేయొద్దనీ, తనను స్వీకరించమని వేడుకుంటున్నది. 'మోహనా' అంటూ లత తీసిన రాగం మోహింపచేస్తుంది. మైమరపింపచేస్తుంది.

మాటీ కరో యా స్వర్ణ్ బనాలో
తన్‌కో మేరే చరణోంసే లగాలో
మురళీ సమఝ్ కర్ హోథోంమే ఉఠాలో

సోచోనా కచ్చు అబ్ హై కృష్ణ మురారీ

ఈ చరణంలో తన్మయీ భావం, ధృఢ సంకల్పం కనిపిస్తాయి. భక్తిభావనలో ఉత్కృష్ట స్థాయి ప్రదర్శితమవుతుంది ఈ చరణంలో. పూర్తి శరణాగతి కనిపిస్తుంది. నన్ను మట్టిగా మిగులుస్తావో, స్వర్ణంగా మలుస్తావో నీ ఇష్టం. నా శరీరాన్ని నీ చరణాల దగ్గర ఉంచుకో. మురళిగా భావించి పెదిమల దగ్గర చేర్చుకో. ఇక ఆలోచించకు కృష్ణా. నన్ను నేను నీకు సంపూర్ణంగా సమర్పించుకుంటున్నాను. సంపూర్ణ సమర్పణ.

ఈ పాటలో మజ్రూహ్ మాధుర్య దాస్య భావనను, సంపూర్ణ సమర్పణ భావనను అద్భుతంగా ప్రదర్శించాడు. చివరి చరణంలో అంతవరకూ ప్రదర్శించిన మంజరీ భావం పరాకాష్టకు చేరుకుంటుంది. గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో మంజరీ భావం ప్రధానమైంది. ఈ భావంలో యువతి తనను సేవికగా భావించుకుంటుంది. అంతేకానీ ప్రేయసిగా కాదు. సేవకురాలిగా, దాసిగా. కృష్ణుడితో సంయోగం కోరరు వీరు. కృష్ణుడికి దాస్యం చేస్తూ, సేవకురాలిగా ఉండేందుకు ఇష్టపడతారు. రాధాకృష్ణుల ప్రేమకు సహాయకారుల్లా మిగిలిపోవాలని వాంఛిస్తారు.

బృందావనంలో కృష్ణుడి చుట్టూ ఉండే గోపికలు రెండు రకాలు. సఖులు, మంజరిలు. సఖులు కృష్ణుడికి సన్నిహితంగా ఉంటారు. శృంగార భావం నెరపుతారు. 'మంజరి'లకు కృష్ణుడితో సాన్నిహిత్యం అవసరం లేదు. శృంగార భావన ఉండనే ఉండదు. వీరు నిస్వార్థ సేవకులు. ఏమీ కోరకుండా, సేవకులుగా ఉండిపోవాలనుకుంటారు. శ్రీకృష్ణుడితో సమాగమంలో రాధకు సహకరించేందుకు సిద్ధంగా ఉంటారు. 'మంజరి'లు అమాయకులు, పవిత్రులు, వికార భావనలు లేనివారు. , రాధాకృష్ణులు సన్నిహితంగా ఉన్నప్పుడు కూడా వీరిని దూరం పొమ్మనరు. వీరు ఆ జంటకు వీవెన వీస్తారు. పూలమాలలు అల్లుతారు. తాంబూలం తయారు చేసిస్తారు. నీరు అందిస్తారు. ఇదొక రకమైన ధ్యానం, తపస్సు. ఈ పాటలో నాయిక అలాంటి తపస్సు కోరుకుంటున్నది. భగవంతుడికి తనను తాను సంపూర్ణంగా సమర్పించుకుంటున్నది. పాలముంచినా, నీట ముంచినా నీదే భారం అంటోంది.

ఈ పాటలో 'సైరాబాను' అందంగా కనిపిస్తుంది. వదనంలో పవిత్ర భావనను ప్రతిఫలిస్తుంది. ఈ పాట రచనలో 'మజ్రూహ్' చేసిన చమత్కారం ఏమిటంటే, సందర్భాన్ని బట్టి రెండు అర్థాలు వచ్చేట్టు పాటను రచించాడు. భజన అన్నది తెలుస్తోంది. పాట శ్రీకృష్ణుడి గురించి. కానీ 'సినిమా కోణం'లో ఈ పాట నాయిక నాయకుడి పట్ల తన ప్రేమ భావనను ప్రదర్శిస్తున్నది. నాయకుడిని కృష్ణుడిలా భావించి తనను స్వీకరించమని, అర్పించుకుంటున్నది.

నాయకుడు విద్యావంతుడు ధనవంతుడు. నాయిక చదువు సంధ్య లేనిది. అడవిలో పెరిగినట్టు పెరిగింది. హీరో స్థాయికి సరిపోదు. అందుకే 'నేను రాధను కాదు అయినా పదే పదే అభ్యర్థిస్తున్నాను నన్ను స్వీకరించమని వేడుకుంటున్నది.' చాలా చక్కటి గేయ రచన సంవిధానం ఇది.

ఒకప్పుడు సినిమాలలో ఇలాంటి పాటలు తప్పనిసరిగా ఉండేవి. ఇలాంటి పాటలద్వారా సమాజానికి భక్తిభావనను అతి సులువుగా నేర్పేవారు సంస్కారమంటే ఏమిటో తెలిపేవారు. ఉదయం లేవటం, పూజ చేయటం వంటి పనులు ఉత్తమ సంస్కారానికి నిదర్శనంగా నిలిపారు. తద్వారా సమాజానికి ఉత్తమాదర్శం అందించేవారు. నాయిక ప్రవర్తన ఉత్తమంగా ఉండేది.

ఇప్పుడు సినిమాలలో 'నాయిక' రూపు రేఖలేకాదు, అర్ధం, ప్రవర్తనలు మారిపోయాయి 'భక్తి' అన్న భావన, సినిమాల్లో అడుగంటింది. కళాకారులో సామాజిక బాధ్యతను వ్యాపారం మిగేసింది. ఇలాంటి పరిస్థితులలో ఇటువంటి పాటలు వింటూంటే మనసు బాధతో మూల్గుతుంది. ఆనాటి కళాకారులు ఎంతగా వ్యాపారం గురించి ఆలోచించినా వారి ఆలోచనలలో సమాజ శ్రేయస్సు, మంచిని చెప్పటం తమ బాధ్యత అన్న ఆలోచనలు పెద్ద పీట వేసేవి. అత్యుత్తమ కళా ప్రదర్శనకు ప్రాధాన్యం ఇచ్చేవారు. అందుకే అప్పటి సినిమాల్లో ఇలాంటి పాటను ఏదో ఓ సందర్భంలో చొప్పించేవారు. వారు సృజించి తమ గుర్తులుగా విడిచి వెళ్ళిన ఇలాంటి పాటలను స్మరిస్తూ, ఆనందిస్తూ, కొత్త తరాలకు పరిచయం చేసి, మందార మకరంద మాధుర్యాన్ని వారికి తెలపటం ద్వారా వారు మధుపాల వెంట పడటం నుంచి మళ్లించవచ్చు. ఉత్తమాదర్శం లేనివారు దొరికిన దారిలో ప్రయాణిస్తారు. వారికి భారతీయ భక్తి తత్వంలోని ఔన్నత్యాన్ని ఇలాంటి పాటలద్వారా పరిచయం చేయవచ్చు.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story